# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే జారే

## 'నేను సైతం చేయూత'లో భాగంగా 'మన ఎమ్మెల్యేమన బడి' విద్యా యాత్ర



**అశ్వారావుపేట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):** అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపరెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలో 'నేను సైతం చేయూత' కార్యక్రమంలో భాగంగా 'మన ఎమ్మెల్యేమన బడి' విద్యా యాత్రను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బుగూడెం ఎంపీపీఎస్ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఉదయం ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొని, అనంతరం తరగతి గదులను సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనా విధానాలు, విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారికి పాఠాలు బోధిస్తూ ఉత్సాహపరిచారు. పాఠశాల ప్రాంగణం, పారిశుద్ధ్యం, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వానికి ముఖ్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మునిగడప వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):** దేశవ్యాప్తంగా చేపట్టిన ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల సవరణ) ప్రక్రియలో భాగంగా తాజాగా విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్నికల కమిషన్ తీరు 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా' ఉందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు విమర్శించారు. నెల రోజులపాటు అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు, ఫొటోలు, చిరునామా మార్పులు, జాబితాలోని తప్పులను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ, తాజాగా విడుదలైన జాబితాలో వాటిలో అనేక మార్పులు కనిపించడం లేదని ఆయన అన్నారు. షిఫ్టెడ్, డబుల్ ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలు చేపట్టి జాబితాను విడుదల చేశారే తప్ప.. ఓటర్లు అందించిన కొత్త ఫొటోలు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు ప్రతిబింబించలేదని ఆరోపించారు. దీంతో ప్రజలు మళ్లీ ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి రావడం వల్ల సమయం, డబ్బు వృథా అవుతుందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ సర్వే సమయంలో ఓటర్లు అందించిన వివరాలు, కొత్త ఫొటోలు, చిరునామా మార్పులను పరిశీలించి, వాటిని తుది ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదు చేయాలని ఎన్నికల అధికారులను వెంకటేశ్వర్లు కోరారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకోవడం పౌరులందరి బాధ్యత

## సామాజిక న్యాయం పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత

## కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు



**కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):** భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అంశాలపై కేవీపీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోడిశాల రాములు అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతం పేరుతో కులాల ఆధారంగా అమలవుతున్న రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్లు తొలగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కుల వ్యవస్థ పూర్తిగా రూపుమాపబడినప్పుడే రిజర్వేషన్ల అవసరం ఉండదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, మైనారిటీ వర్గాలకు సామాజిక న్యాయం అందేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంతో పాటు కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు అన్ని వర్గాలు కృషి చేయాలని, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ప్రజల్లో చైతన్యం పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, మన్యం మోహన్‌రావు, ఎన్. రమేశ్, కనకయ్య, నాగరాజు, రాములు, ఇంజ రాములు, గుర్రం రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలచలకలో పిచ్చికుక్క దాడి.. ఐదుగురికి గాయాలు

## కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలింపు





**టేకులపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):** టేకులపల్లి మండలం సులానగర్ పీహెచ్‌సీ పరిధిలోని తుమ్మలచలక గ్రామంలో పిచ్చికుక్క హల్‌చల్ చేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కుక్క దాడిలో ఐదుగురు గాయపడ్డారు. చీమల నాగరాజు, ఊకే గోపాల్, ఊకే లలిత్, మోహన్ ఎరెం వెంకన్న, బొర్ర స్వామి కుక్కకాటుకు గురయ్యారు. బాధితులను సులానగర్ పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, కుక్క మరింత మందిపై దాడి చేయకుండా ఊకే గోపాల్ ధైర్యంగా దాన్ని పట్టుకోగా స్థానికులు సహకరించి దానిని చంపివేశారు. కుక్కకాటుకు గురైన వెంటనే గాయాలను సబ్బు, ప్రవహించే నీటితో శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని డాక్టర్ వెంకటేష్ సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# వీకే కోల్‌మైన్‌ను పరిశీలించిన డైరెక్టర్ వెంకటేశ్వర్లు

## భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.. ఉత్పత్తి, డిస్పాచ్ లక్ష్యాలు సాధించాలి





**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):** సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వీకే కోల్‌మైన్‌ను డైరెక్టర్ (పి&పీ) కె. వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించి గని కార్యకలాపాలను సమీక్షించారు. గనిలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. భద్రతా చర్యలు, సేఫ్టీ ప్రికాషన్స్, బొగ్గు డిస్పాచ్, ఓవర్‌బర్డెన్ రిమూవల్ పని తీరుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. గనిలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు పాటించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, డిస్పాచ్ లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించాలని, ఓబీ రిమూవల్ పనితీరును మెరుగుపరచాలని సూచించారు. గని కార్యకలాపాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలని తెలిపారు. సింగరేణి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికా రులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ వెంకట రమణ, జీఎం (సేఫ్టీ) కార్పొరేట్ సాయిబాబు, ఎస్వో టు జీఎం, యాక్టింగ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి

## ఏఐఎస్ఎఫ్‌విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి: ఫహీమ్ దాదా

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):** విద్యార్థి ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ దిక్సూచిగా నిలుస్తోందని ఆ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా అన్నారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని ఫహీమ్ దాదా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంతో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, విద్య, ఉపాధి హక్కుల సాధన కోసం విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో దళితులు, గిరిజనులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రతి విద్యార్థికి సమాన విద్య అందించాలని కోరారు. డిగ్రీలు పూర్తి చేసిన యువతకు ఉపాధి కల్పించేలా 'భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ యాక్ట్' అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, మాణిక్యాల వినయ్, కొయ్యడ రవి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు



## - ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల పరిరక్షణకు జేఏసీ ఏర్పాటు




**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రతిపాదిత 'శక్తి' పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇతర వ్యవస్థల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది జేఏసీని ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 11 మందితో స్థానిక జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది లంచ్ అవర్‌లో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. 'శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల ప్రత్యేకతను కాపాడటంతో పాటు సాంకేతిక విద్యా వ్యవస్థ పరిరక్షణకు అన్ని వర్గాల సిబ్బంది ఐక్యంగా ఉద్యమించాలని ప్రిన్సిపాల్ బుగ్గే కరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తున్నాయని జేఏసీ నాయకులు తెలిపారు. వాటిని ఇతర వ్యవస్థల్లో విలీనం చేయకుండా మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జేఏసీలను ఏర్పాటు చేసి సెంట్రల్ జేఏసీతో అనుసంధానం చేస్తామని తెలిపారు. కొత్తగూడెం జేఏసీ కార్యవర్గం: చైర్మన్‌గా ఎ. మాసయ్య, కో-చైర్మన్లుగా జీవీఆర్ లక్ష్మణ్‌రావు, సీహెచ్ కృష్ణారావు, బి. మస్నా, కన్వీనర్‌గా డి. శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా ఎండీ ఫైజ్, పీఆర్ సెక్రటరీగా సీహెచ్ రవికుమార్, మహిళా విభాగం సెక్రటరీగా పి. వనిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి. లింగ్య, కమ్యూనికేషన్స్ సెక్రటరీగా బి. రాము, కోశాధికారిగా డి. శశాంక్ ఎన్నికయ్యారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలి

## కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా





**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సూచనలతో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి నాయకత్వంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే ఆమోదమైన దరఖాస్తులకు వెంటనే చెక్కులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పథకాల కొనసాగింపుపై ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. పేదల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డి. పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్, మాజీ కౌన్సిలర్లు తోగూర్ రాజశేఖర్, అంబుల వేణుతో పాటు బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలి



**చుంచుపల్లి (తెలంగాణ వాణి)** పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని చుంచుపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పథకాల కొనసాగింపును కోరుతూ మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ప్రారంభమైన ఈ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహానికి రూ.1,00,116 ఆర్థిక సాయం అందిందన్నారు. పథకాన్ని కొనసాగించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖం డించారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ మండల అధ్యక్షుడు ముత్యాల రాజేష్, గూడెల్లి యాకయ్య, సీనియర్ నాయకులు రంగరాజు రాజేష్, దుర్గేష్, సర్పంచ్ శ్రీకాంత్ నాయక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు 'ఉద్దీపకం-3' దిక్సూచి



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)** గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం రూపొందించిన 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం పృథ్వీరాజ్‌నగర్ (ఎదురుగడ్డ) టీడబ్ల్యూయూపీఎస్ పాఠశాలలో ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు పి. అనసూయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భట్టు అరుణ్, ఉప సర్పంచ్ భుక్యా జయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల కోసం 'ఉద్దీపకం-3' వంటి పుస్తకాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఇవి విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతో పాటు జ్ఞానాన్ని విస్తరించి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తేజావత్ శివ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చెల్లి ప్రేమ వివాహంపై కక్ష.. వ్యక్తిపై కత్తితో హత్యాయత్నం

## హత్యాయత్నం కేసును ఛేదించిన కోనరావుపేట పోలీసులు.. ఇద్దరు అరెస్ట్



**కోనరావుపేట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)** చెల్లి ప్రేమ వివాహం చేసుకుందన్న కక్షతో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను కోన రావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. చందుర్తి సీఐ కే. రవీందర్ సోమవారం వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేటకు చెందిన దండగుల సురేష్ చెల్లి మరియా, మ ల్కాపేటకు చెందిన శివరాత్రి అజయ్‌ను ప్రేమ వివాహం చేసు కుంది. ఈ నెల 16న సురేష్ తాత మృతిచెందడంతో మరియా, అజయ్ కోనరావుపేటకు వచ్చారు. ఈ సందర్భంగా సురేష్ తల్లి యాదవ్వకు, మరియాకు మధ్య గొడవ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సురేష్ అజయ్‌పై కక్ష పెంచుకున్నాడు. అజయ్ నిమ్మపల్లిలో ఉన్నాడని తెలుసుకున్న సురేష్ తన స్నేహితుడు వీర్నపల్లి మండలం కంచర్లకు చెందిన గోగుల రామకృష్ణతో కలిసి అక్కడికి వెళ్లాడు. అజయ్‌ను అడ్డుకుని కత్తితో ఛాతీ, కడుపు, వీపు భాగాల్లో దాడి చేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోమవారం సురేష్, రామకృష్ణలను అరెస్ట్ చేసి, వారి నుంచి కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్సై కె. ప్రశాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని సీఐ రవీందర్ అభినందించారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



## కామ్రేడ్ మంగన్న ఆశయాలను కొనసాగిద్దాం

**సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్**



**టేకులపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కామ్రేడ్ మంగన్న ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ పిలుపు నిచ్చారు. టేకులపల్లి మండలం లచ్చతండాకు చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి భానోత్ ఉక్ల తండ్రి కామ్రేడ్ మంగన్న మృతి చెందడంతో సోమ వారం పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. మంగన్న 1980లో జరిగిన పోడు భూముల, ఏకాలనీతండా భూ పోరాటాల్లో పాల్గొని పార్టీకి సహానుభూతిపరుడిగా కొనసాగారని గుర్తుచేశారు. ఆయన మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. మంగన్న ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, భూక్య శివనాయక్, సూర్యాపేట జిల్లా కార్యదర్శి అంజయ్య, సుంకరి బుచ్చయ్య, పడిగ మంగన్న, గుగులోత్ గణేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

**ప్రజావాణిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి వినతి**




**తల్లాడ, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
తల్లాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మిరెడ్డి సోమవారం నిర్వహించిన తొలి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలంకొత్తగూడెం, సత్తుపల్లిరాజమండ్రి ప్రధాన మార్గాలకు కూడలిగా ఉన్న తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే పట్టణం మరింత సుందరంగా మారడంతో పాటు రాత్రి వేళల్లో ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్టీఆర్ నగర్ నుంచి బిల్లుపాడు వరకు రహదారి పనులను పూర్తి చేయాలని మరో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ మూకర ప్రసాద్, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి ప్రజావాణికి అపూర్వస్పందన




**శంకరపట్నం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
గ్రామస్థాయిలో ప్రజలకు కలిగే సమస్యలు, ఇబ్బందులు వాటి పరిష్కారానికి ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దరఖాస్తులను స్వీకరించేది. కాగా గ్రామస్థాయిలోని సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా పరిగణిస్తూ అక్కడికక్కడే స్వస్తి పలికేందుకు మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇటీవల రెండు వారాల క్రితం రెవెన్యూ డివిజనల్, సోమవారం మండల స్థాయిలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయగా సోమవారం శంకరపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మండల మండల ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు మండల అధికారులు పాల్గొనగా 17 దరఖాస్తులు అందాయి. వీటిలో 15 రెవెన్యూ శాఖకు చెందగా, రెండు పంచాయతీరాజ్ శాఖ కి అందాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని, గ్రామాలలో ప్రజలకు కలిగే ఇబ్బందులు, సమస్యలు దరఖాస్తుతో అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి జి. భాగ్యలక్ష్మి, ఎంపీడీవో అనిత, తహసీల్దారు కె. సురేఖ, నాయక్ తహసిల్దారు నాయబ్ సాయి కృష్ణ, ఎస్. ఐ. కె. శేఖర్, వైద్యాధికారి డాక్టర్. గొట్టే శ్రావణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు,లారీ ఢీ.. 20 మందికి గాయాలు




**జగిత్యాల: ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లాలోని కొండగట్టు సమీపంలో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను అందుబాటులో ఉన్న వాహనాల్లో జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కొందరికి స్వల్ప గాయాలు కాగా, మరికొందరికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఐటీడీఏ పాఠశాలల స్కావెంజర్లకు వేతనాలు చెల్లించాలి




**వెట్టి చాకిరీ చేయించవద్దు.. సెప్టెంబర్ 1 నుంచి**

**వంట పనులే చేస్తాం: యూనియన్**

**ఏటూరునాగారం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ఐటీడీఏ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి స్కావెంజర్‌కు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని కోరింది. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం భారతి అధ్యక్షతన సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లకు వేతనాలుచెల్లిస్తున్నప్పటికీ,ఐటీడీఏపాఠ శాలల్లో మాత్రం వేతనాలు లేకుండా శుభ్రత పనులు చేయి స్తున్నారని ఆరోపించారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1లోగా సమస్య పరిష్కరిం చకపోతే వంట కార్మికులు వంట పనులు మాత్రమే చేసి, శుభ్రత పనులు చేయబోమని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలని కోరారు.

## హామీలు అమలు చేయకుండా మూడేళ్లు గడిపారు: వినయ్ భాస్కర్




**తెలంగాణ వాణి,ఉమ్మడి వరంగల్ బ్యూరో,(ఆగస్టు 17) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో మూడేళ్లు గడిపిందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సాధించిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పెద్దగా ఆలోచించి అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని వినయ్ భాస్కర్ అన్నారు. దళితులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో దళితబంధు పథకాన్ని తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను రేవంత్‌రెడ్డి ప్రారంభించారని, అయితే ఆ భవన నిర్మాణానికి పునాది వేసింది గత ప్రభుత్వమేనని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ ఉద్యమం చేసి సాధించుకుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులకు రాజకీయ విమర్శలు, సమాధానాలు చెప్పడం బాగా తెలుసని, వ్యక్తిగత దూషణలతో సమస్యలు పరిష్కారం కావని వినయ్ భాస్కర్ అన్నారు. కేసీఆర్ సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పరకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శించడానికే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రైతులకు సకాలంలో యూరియా అందించడం ప్రభుత్వ బాధ్యతేనని, దానిని ఉచితంగా అందిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేసీఆర్ హయాంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులు వచ్చాయని ధర్మారెడ్డి పేర్కొన్నారు. స్టేజీ పక్కనే నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని ఆరోపించారు. ప్రజాధనాన్ని వృథా చేయడానికే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ ఆందోళన

**హనుమకొండలో కలెక్టరేట్ ఎదుట నిరసన..**

**మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ అరెస్ట్**





**హనుమకొండ, ఆగస్టు 17 (తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో):**
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో ఆందోళన నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయం నుంచి మహిళలు, నాయకులు ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు వినయ్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి వినయ్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో కలెక్టరేట్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## వనపర్తిలో హిందూ స్మశానవాటికకు స్థలం కేటాయించాలి

**- మున్సిపల్ కమిషనర్‌కు**

**ఆర్యవైశ్య సంఘం వినతి**



**వనపర్తి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి పట్టణంలో హిందూ స్మశానవాటికకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బచ్చురాము కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బచ్చురాము మాట్లాడుతూ వనపర్తి పట్టణం ఏర్పడి సుమారు 300 ఏళ్లు గడిచినా హిందూ స్మశానవాటికకు తగిన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో ఖననం చేసేందుకు స్థలం సరిపోకపోవడంతో పాటు నీరు, మరుగుదొడ్లు, మహిళలకు దుస్తులు మార్చుకునే సౌకర్యాలు కూడా లేవన్నారు. దహన సంస్కారాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యుత్ దహన యంత్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కొత్తగా స్మశానవాటికకు స్థలం కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్మశానవాటిక నిర్వహణకు ఇద్దరు మున్సిపల్ కార్మికులను నియమించి వారికి వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమస్యను గతంలో జిల్లా, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని పేర్కొంటూ, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని బచ్చురాము కోరారు.

## బీడీ కార్మికుల పింఛన్లు తక్షణమే అమలు చేయాలి

**- బీడీ కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా**





**కోరుట్ల, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
బీడీ కార్మికుల పింఛన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కోరుట్ల పట్టణ బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బీడీ కార్మికులకు పింఛన్లు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. బీడీ కార్మికుల పింఛన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను కొనసాగించాలని కోరారు. పింఛన్లను తక్షణమే అమలు చేయకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున మహిళలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కోరుట్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ బీడీ పింఛన్ల కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, చిట్టి వెంకట్రావు, స్వరూప, సర్పంచులు రాజ్‌కుమార్, జల భాస్కర్, రాణి రాజు, స్రవంతి, భూలక్ష్మి, ఉపసర్పంచ్ సౌమ్య, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అంజయ్య, రాజ నర్సయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నారుగూడెం వంటమేస్త్రీ నోముల హుస్సేన్ మృతి..



**తల్లాడ, ఆగస్టు 17 (తెలంగాణ వాణి) :**
మండలంలోని అన్నారు గూడెం గ్రామానికి చెందిన ప్రముఖ వంట మేస్త్రి నోముల హుస్సేన్ (61)మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఖమ్మం హాస్పిటల్ లో తుది శ్వాస విడిచారు. వంటలు చేస్తూ చుట్టుపక్క గ్రామాల ప్రజలకు సుపరిచితులుగా ఉన్నారు. జిల్లాలో వంట మేస్త్రిగా ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వివిధ గ్రామాల ప్రజలకు కూడా ఆయనను కడసారి చూసి కన్నీటి పరవంతమయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మనం రిపోర్టర్ గొడ్ల బాబురావు, (తెలంగాణ వాణి) రిపోర్టర్ గొడ్ల నరసింహారావు, హుస్సేన్ కుమారుడు కరుణాకర్, దాసరి యేసు తదితరులు ఉన్నారు.

## వర్షాలు కురవాలని తల్లాడలో గ్రామదేవతలకు పూజలు



**తల్లాడ, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
వర్షాలు సకాలంలో కురిసి పంటలు పండాలని తల్లాడ పట్టణ రైతులు సోమవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ్ల తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ రైతులు, వ్యాపారవేత్తలు, మహిళలు బిందెల ద్వారా అమ్మ వార్లకు నీరు పోస్తూ వర్షాలు కురవాలని పూజలు చేశారు. తల్లాడ పట్టణంలో ఉన్న పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండ టంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ దేవతలకు పట్టణ వాసులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, నం బూరీ మోహన్ రావు, రెడ్డెం వీర మోహన్ రెడ్డి, షేక్. ఈసూబ్, గుంటుపల్లి వెంకటయ్య,దగ్గుల శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని రామయ్య, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భద్రారెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, మొక్కా బసవయ్య, మొక్క కృష్ణ అర్జున్, కేసర వెంకటేశ్వర రెడ్డి, రామారావు, లగడపాటి నెహ్రూ, వేమశెట్టి నాగన్న, చంద్రరావు, మంగయ్య, కోటయ్య పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లాలో నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

**అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలి:**

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు మం గళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పర్యటన ఏర్పాట్లపై సోమ వారం ఐడీఓసీలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమన్వయ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, చట్టాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధిం చిన కేసుల పరిష్కారంలో జాప్యం, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో కూడిన నివేదికలను సిద్ధం చేసుకుని నిర్ణీత సమ యానికి సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంతకుమారి, ఆర్డీఓ హరికృష్ణ, డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారి సుకీర్తి తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం । 18 । ఆగస్టు । 2026

# అక్రమ ఇసుక రవాణా.. వ్యక్తి అరెస్ట్

## ట్రాక్టర్ స్వాధీనం.. కేసు నమోదు

**వీణవంక, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



వీణవంక మండలం కొండపాక మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇసుక రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో సోమ వారం ఉదయం 11.30 గంటలకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి డ్రైవర్ కమ్ ఓనర్ కోలుగురి రాజ్‌కుమార్ (25)ను అదుపులోకి తీసుకున్నారు.కొండపాక గ్రామానికి చెందిన సమ్మయ్య కుమారుడైన రాజ్‌కుమార్ నుంచి ట్రాక్టర్ నంబర్ 02 4422, ట్రాలీ నంబర్ 02 4423ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని ఎస్సై హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

# రాజాపేటలో మండల స్థాయి ప్రజావాణి




**రాజపేట, ఆగస్టు:17(తెలంగాణ వాణి విలేఖరి)**

రాజాపేట మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం రాజపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు ఉదయం 10 గంటలకు హాజర య్యారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సం దర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 16 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మండల అభివృద్ధి అధికారి నాగవేణి తెలిపారు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ రవి కిరణ్,ఎంపీఓ ఆవుల కిషన్,సూపరింటెండెంట్ ఇన్నారెడ్డి, ఎంఏవో పద్మజ,ఎంఈఓ రమేష్,వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐఏఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సభ్యత్వ నమోదు ప్రారంభం



**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 20262027 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం కొత్తగూడెం జిల్లా కోర్టులో ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. ఉదయ భాస్కర్ మాట్లాడుతూ.. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, న్యాయవ్యవస్థ స్వతంత్రత, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఐఏఎల్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ఐఏఎల్ లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. న్యాయవాద వృత్తిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడటంతో పాటు, ప్రజలకు సత్వరంగా, సమర్థవంతంగా న్యాయం అందేలా కృషి చేయడం ఐఏఎల్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. ఐఏఎల్ రాష్ట్ర నాయకులు భాగం మాధవరావు మాట్లాడుతూ.. 20262027 సంవత్సరానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ఐఏఎల్ సభ్యత్వం పొందాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, ఐఏఎల్ రాష్ట్ర నాయకులు పోసాని రాధాకృష్ణమూర్తి, వై. బాబూరావు, జి.వి. హరిప్రసాద్, బండ్ల రాజశేఖర్, మునిగడప వెంకటేశ్వర్లు, లక్కినేని వెంకట దుర్గారావు, ఉప్పుశెట్టి సునీల్, గడిదేసి నాగరాజు, పప్పుల ప్రసాద్, మునుకోటి రాకేష్, జింక మదన్మోహన్, సుధారామారావు, భార్గవ్, మహిళా న్యాయవాదులు ఇందిరా ప్రియదర్శిని, లీలావతి, ఉమా, రోజా తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గేపై కుల వివక్షకు నిరసనగా భారీ ర్యాలీ

### అంటరానితనాన్ని ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### గద్దల రమేష్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్






**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే పట్ల కుల వివక్ష, అంటరానితన ఘటనను నిరసిస్తు రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆదేశం సారంగా భద్రాద్రి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ అమర వీరుల స్తూపం నుండి పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం వరకు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రాం లీలా మైదానంలో ఖర్గే ప్రసంగించిన వేదికను అనంతరం 'శు ద్ధీకరణ' పేరుతో హవన్ నిర్వహించడం రాంసేన ముసుగులో బీజేపీ శక్తులు చేస్తున్న కుల, మతపర మైన రాజకీయాలకు నిద ర్శనం అన్నారు. ఈ ఘటనను సామాజిక సమానత్వానికి, రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన చర్య అని, ఒక దళిత నాయ కుడు దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదికల్లో ఒకటైన రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడం ద్వారా అంటరానితన భావజాలాన్ని ప్రోత్సహించే ప్రయత్నం జరిగిందని వారు ఆరో పించారు..చర్యలు తీసుకునే వరకు పోరాటంకుల వివక్షకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారిపై రాజ్య ద్రోహం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలిదేశంలో కులం, మతం, ప్రాంతం ఆధారంగా ఎవరినీ అవమానించకూడదని, ప్రతి పౌరుడికి సమాన గౌరవం కల్పిం చాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అంటరానితనం వంటి వివక్షకు వ్యతిరేకంగా సామా జిక చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఖర్గేపై జరి గిన ఈ ఈ ఘటనను కేవలం రాజకీయ వివాదంగా కాకుండా సామాజిక సమానత్వం, దళితుల ఆత్మగౌరవానికి సంబం ధించిన అంశంగా చూడాలని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**నిరసన ధర్నాకు ఎమ్మెల్యే కూనంనేని సంఘీ భావం**

ఖర్గేపై కుల వివక్షకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా నిరసన ధర్నాకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా సంఘీభావం తెలిపారు. కుల, మత వివక్ష రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కూనంనేని అన్నారు. ఖర్గే ఘటనపై సమగ్ర విచా రణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవం, సామాజిక సమా నత్వం కోసం జరిగే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఉంటుం దని స్పష్టం చేశారు. ఒక్కసారి ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ చైర్మన్ గడ్డం రాజశేఖర్, స్టేట్ జనరల్ సెక్రెటరీ కిరణ్ కుమార్, కార్పొరేటర్ కేకే శ్రీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ ఆంతోటి పాల్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు కల్లెపల్లె చంద్ర శేఖర్, వైస్ చైర్మన్, పడిసిరి శ్రీనివాస్, జాడి శ్రీనివాస్,ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీలు, మోదుగు రామకృష్ణ, దార చిరంజీవి, సంపత్ కుమార్, బత్తినేని జనరల్ సెక్రెటరీలు దీపంగి వెంకట రమణ,రాజశేఖర్, భారతి, జయమ్మ, జిల్లా కార్యదర్శి పుల్లూరి కుమార్,పినపాక నియోజకవర్గం అధ్యక్షులు, కొట్టే అనిల్ కు మార్ పాల్వంచ టౌన్ అధ్యక్షులు, మహిళ టౌన్ అధ్యక్షురాలు రాణి సదాశివ, మండల అధ్యక్షులు ఇందు కుమార్, పడుతూర్ రవి, పాలకుర్తి రవి, మచ్చ రాజా, మంద బాబు, పాల్గొన్నారు.

# ఐటిడిఎ పాఠశాలల స్కావెంజర్లకు వేతనాలు చెల్లించాలి




**ఏటూరునాగారం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**

ఐటిడిఎ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి స్కావెంజర్‌కు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని కోరింది.ఈ మేరకు సోమవారం ఏటూరునాగారం ఐటిడిఎ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం భారతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ పీఓకు అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లకు వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ, ఐటిడిఎ పరిధిలో మాత్రం వేతనాలు లేకుండానే శుభ్రత పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. స్కావెంజర్లతో వెట్టి చాకిరీ చేయించకుండా వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.సమస్య పరిష్కరించకపోతే సెప్టెంబర్ 1 నుంచి మధ్యాహ్న భోజనం వంట పనులు మాత్రమే చేస్తామని, శు భ్రత పనులు చేపట్టబోమని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ సమస్యపై ఐటిడిఎ అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# 23న 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి




**కొత్తగూడెం లీగల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**

ఈ నెల 23న హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ కాంట్రి బ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీ ఎస్ఈయూ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో హైదరా బాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు పిలుపునిచ్చారు.కొత్తగూడెంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవి ష్కరించారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి టీఎస్‌సీపీ ఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి నాగు నాయక్, జిల్లా టీమ్ సభ్యుడు మజార్ అహ్మద్ మాట్లాడారు. ఉద్యోగులు అధిక సం ఖ్యలో పాల్గొని హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో జ్యుడీషి యల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిశెట్టి రమేష్, వైస్ ప్రెసి డెంట్ మీనా కుమారి, ఉద్యోగులు ప్రమీల, కోటేశ్వరరావు, కవిత, రామతులసి, సుశీల, మాధవరావు, కృష్ణ, ఉష, తాజోద్దీన్ బాబా, విజయలక్ష్మి, సాయిబాబు, కాల్వ రమేష్, మరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండపల్లి ఎంపీపీ కార్యాలయంలో ప్రజావాణి




### 11 వినతులు స్వీకరించిన అధికారులు

### త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓ ఆదేశం

**ఎండపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**

ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ డి. కృపాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్య లపై 11 వినతులు స్వీకరించారు.వినతులను పరిశీలించిన ఎం పీడీఓ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజ లకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో తహశీల్దార్ ఎ. అనిల్ కుమార్, ఎస్‌హెచ్ఓ ఎన్. కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ



**ధర్మారం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**

ధర్మారం మండల కేంద్రానికి చెందిన దాత లక్ష్మీరాజం తన మనుమరాలు జి. సుకన్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఎం పీపీఎస్ పాఠశాలలో 170 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్ను లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లక్ష్మీరాజం మాట్లాడుతూ జన్మదిన వేడుకలకు అనవసర ఖర్చులు చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందించిన లక్ష్మీరాజం,

# శ్రీ కనకదుర్గ ఫుట్‌వేర్, కార్తికేయ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం

**జమ్మికుంట, ఆగస్టు 17,(తెలంగాణ వాణి ప్రతినిధి):**

పట్టణ ప్రజల సౌకర్యార్థం జమ్మికుంట పట్టణ పరిధిలో నూత నంగా ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ ఫుట్‌వేర్ మరియు కార్తికేయ డయాగ్నొస్టిక్ సెంటర్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు అవసరమైన వ్యాపార, వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. నూతనంగా ప్రారంభమైన సంస్థలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.శ్రీ కనకదుర్గ ఫుట్‌వేర్‌ను వంశీ ఆధ్వర్యంలో, కార్తికేయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చందా రాజు, దిడ్డి రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.